## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మధిర: మధిర పట్టణంలోని పీవీఆర్ కల్యాణ మండపం సమీపంలో ఆదివారం రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. కల్లూరు మండలం కప్పలబంధం గ్రామానికి చెందిన ఎక్కిరాల లాలయ్య మోటార్ సైకిల్‌పై మధిర నుంచి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వేరే మోటార్ సైకిల్ వచ్చి ఢీ కొట్టింది. ఈ క్రమంలో లాలయ్యకు గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి, సుదర్శన్ క్షతగాత్రుడిని మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### ఉపాధిని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

సత్తుపల్లిరూరల్: జాతీయ ఉపాధిహామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీల పొట్టకొట్టేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఈ కేంద్ర ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

### తుమ్మలను కలిసిన మట్టా దయానంద్



మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో డాక్టర్ మట్టా దయానంద్

సత్తుపల్లి: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదివారం దమ్మపేట మండలం గండుగులపల్లిలోని ఆయన నివాసంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు సందీప్ గౌడ్, ఇమ్మినేని ప్రసాదరావు, ఎండీ ఫయాజ్‌అలీ, ఎండీ కమల్‌పాషా, బత్తుపల్లి భరత్, తమ్మిశెట్టి గణేష్, సాయిశ్రీనివాస్, యూనిస్, ఉన్నారు.

### వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యుడు రోషన్‌కుమార్

బోనకల్: మండలంలోని మేఘశ్రీ ఆస్పత్రిలో బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెలా మొదటి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి వైద్యుడు పవన్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో రోగులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తూము రోషన్‌కుమార్, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, వైద్య శిబిరం నిర్వాహకులు ఆకెన పవన్, యంగల గిరి, ఇవాంజలిన్ తదితరులు పాల్గొన్నారు.

### వీరుల త్యాగాలను గౌరవిద్దాం..



మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

ఏన్కూరు: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి అమరులైన వీరులందరినీ గౌరవించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్యాం సుందర్ నాయక్ అన్నారు. స్వాతంత్ర్య పోరాట యోధుల జ్ఞాపకార్థం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు నా నేల.. నా దేశం పేరుతో వీరుల నడయాడిన ప్రతీ గ్రామం నుంచి మట్టి సేకరించే కార్యక్రమాల్లో భాగంగా మండల కేంద్రంలో ఆదివారం మట్టి సేకరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామం నుంచి మట్టి సేకరించి ఢిల్లీకి పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొవ్వూరి నాగేశ్వరరావు, ఈసం రమేష్, చింతనబోయిన రాందాస్, గుగులోత్ శశికిరన్, వజినేపల్లి దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# ‘గృహలక్ష్మి’ వరించేనా..?

- మండలంలో 3,384 దరఖాస్తులు
- నియోజకవర్గానికి 3000 ఇళ్లు మంజూరు
- క్షేత్రస్థాయిలో రెవెన్యూ బృందాల పరిశీలన



గోకినేపల్లిలో శిథిలావస్థలో ఇల్లు



పెద్దమండవలో సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి (ఫైల్)

ముదిగొండ: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పేదల పథకం గృహలక్ష్మి. ఇప్పటివరకు ఒకే ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు నివాసముంటున్న వారు, పెంకుటింటిలో, అద్దెకు ఉంటున్నవారున్నారు. ప్రభుత్వం పేదల అవసరాలను బట్టి ఓ బృహత్తర పథకాన్ని ప్రవేశపెట్టి దానికి ఆద్యం పోశారు. దీంతో పేదలనుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి.

**సమగ్ర సర్వే..**

రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటి సమగ్ర సర్వే చేపట్టింది. సర్వేలో అర్హులను గుర్తించి నివేదికలు అందించారు. దీంతో ఓ కిలిక్కి వచ్చిన దరఖాస్తులకు సగానికి పైగా నిబంధనల ప్రకారం తిరస్కరించారు. ఉన్న దరఖాస్తు దారుల్లో గృహలక్ష్మి ఎవరికి వరించోనని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**దరఖాస్తుల వెల్లువ..**

ముదిగొండ మండలంలోని 25 గ్రామపంచాయతీలుండగా, 85వేల మంది జనాభా ఉన్నారు. మొత్తం ఓటర్లు 58,485మంది ఉన్నారు. ముదిగొండ మండలంలో 3,384మంది దరఖాస్తులు చేసుకొన్నారు. ఇందులో 2,363మందికి ఇళ్లు లేవని సర్వేలో తెలిసింది. ఆన్‌లైన ప్రక్రియ పూర్తైన పిమ్మట పథకం అమలు పరిచేందుకు అధికారులు అన్నీ సిద్ధం చేశారు. స్థలాలున్న పేదలు పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఇప్పటివరకు వేచి ఉన్నారు. దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని ప్రకటించడంతో ఆశావాహులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రతి పంచాయతీలో ఇంకా దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు వాటిని సర్వే చేసి పంపిస్తున్నారు.

త్వరలో మొదటి విడతలో గృహలక్ష్మి పథకం తొలి విడత నిధులు మంజూరు కానున్నట్లు ప్రభుత్వం ప్రకటిస్తోంది. నివేదికలు అందిన తరువాత లబ్ధిదారుల జాబితాను విడుదల చేయనున్నారు. తొలివిడుతలో గృహలక్ష్మి పథకం ఎవరిని వరిస్తుందోనని ఆశా వాహులు ఎదరుచూస్తున్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం..**



మాకు ఇల్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న ఖాళీ స్థలంలో ప్రభుత్వం అందించే డబ్బులతో నిర్మించుకోవాలని ఎదురు చూస్తున్నా.. దరఖాస్తు చేసుకున్న దానిలో ఎంపిక చేశారో లేదో తెలియదు. నిరుపేదలను గుర్తించి ఇవ్వాలి.

– భూక్య సీత, గోకినేపల్లి

**అర్హులను గుర్తించాం..**



మాకు అందిన దరఖాస్తుల్లో సిబ్బందితో పూర్తి సమగ్ర సర్వే చేపట్టాం. అందులో అర్హులను గుర్తించాం. తప్పని సరిగా ప్రభుత్వం ప్రకటించే మొదటి జాబితాలో ఎంతమందికి ఇస్తుందో వేచి చూడాలి. అర్హులందరికీ పథకం అమలు చేస్తాం.

– అశోక్‌కుమార్, ఎంపీడీఓ, ముదిగొండ

# ఓటు హక్కు తప్పనిసరి..



సత్తుపల్లి: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి



ఎర్రుపాలెం: మీనవోలులో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

సత్తుపల్లి: 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు పరిశీలించాలని ఆదేశించారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యోగీశ్వర రావు, ఆర్ఐ నరేష్ ఉన్నారు.

**పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్డీఓ**

ఎర్రుపాలెం/ చింతకాని/ బోనకల్: ఎర్రుపాలెం మండలంలోని పెద్దగోపవరం, మీనవోలు గ్రామాల్లో ఆదివారం ఓటర్ నమోదు పోలింగ్ కేంద్రాలతో పాటుగా.. చింతకాని మండలంలోని పందిళ్లపల్లి, నాగులవంచ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను, బోనకల్ పోలింగ్ కేంద్రాలను ఖమ్మం ఆర్డీఓ గణేష్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించి బూత్ లెవల్ అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమాలల్లో తహసీల్దార్లు ఉషాశారద, రమేష్, పున్నం చందర్ తదితరులు పాల్గొన్నారు.

# ‘జమిలి’ ఎన్నికలతో బీజేపీకి లబ్ధి



మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

ఎర్రుపాలెం: జమిలి ఎన్నికలతో బీజేపీ లబ్ధి చేకూరుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీకి అనుకూల పరిస్థితులు లేకపోవడంతోనే జమిలి ఎన్నికలు పెట్టాలని ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం, బీజేపీ రెండూ ఒక్కటేనన్నారు. బీజేపీని ఓడించడమే సీపీఎం లక్ష్యమన్నారు. కర్నాటక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని, అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీతో సీపీఎంకు పొత్తు ఉండకపోవచ్చని తెలిపారు. వామపక్ష పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తాయన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు నిరసన ప్రదర్శలు, ఈ నెల 10 నుంచి 17 వరకు సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతలచెర్వు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, నాయకులు సగ్గుర్తి సంజీవరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, తోట సాంబశివరావు, బేతి శ్రీనివాసరావు, రామిశెట్టి సురేష్, షేక్ నాగుల్‌మీరా, అనుమోలు వెంకటేశ్వరరావు, నాగులవంచ వెంకట్రామయ్య, కోటి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



సాలెబంజరలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బాలాజీ నాయక్

కొణిజర్ల: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని వైరా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు బానోత్ బాలాజీ అన్నారు. ఆదివారం మండలంలోని సాలెబంజర, క్రాంతినగర్, జంపాలనగ్ గ్రామాల్లో సోనియమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఆయా గ్రామాల్లో 750 మంది మహిళలకు ఇంటింటికీ వెళ్లి చీరలు అందించి కాంగ్రెస్ పథకాలను వివరించాడు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.400కే వంట గ్యాస్, రూ.2 లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇంటికి రూ.6 లక్షల రుణసాయం తదితర సదుపాయాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ పద్మావతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏన్కూరు: మండలంలోని కేసుపల్లిలో ఈ నెల 4న విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు సబ్‌ఇంజనీర్ కిషోర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసుపల్లి 11కేవీ ఫీడర్ నందు చెట్లను కొట్టే కార్యక్రమం ఉన్నందున ఉదయం 7:30 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

### వీఆర్‌ఏ మీరావలి మృతి

చింతకాని: మండలంలోని చినమండవ గ్రామానికి చెందిన వీఆర్‌ఏల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు షేక్ మీరావలి (48) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మీరావలి గతంలో వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మూడేళ్ల పాటు పనిచేశాడు. చినమండవ గ్రామానికి వీఆర్‌ఏగా పనిచేస్తున్న మీరావలి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వీఆర్‌ఏల క్రమబద్ధీకరణ, పదోన్నతుల్లో భాగంగా ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు తహసీల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు.

**మెప్మా ఆర్పీ రుక్మిణి..**

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గుడిపాడుకు చెందిన మెప్మా రిసోర్స్ పర్సన్‌గా పని చేస్తున్న వనమాల రుక్మిణి(29) ఆదివారం తెల్లవారు జామున మృతి చెందింది. ఈమె గత కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త లక్ష్మణ్‌రావు, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె మృతదేహాన్ని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు ప్రసాద్, నరేష్, రిసోర్స్ పర్సన్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం



వేదాంత్‌ను సత్కరిస్తున్న మూల దుర్గా ప్రసాద్

వైరా: నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించిన విద్యార్థికి బీఆర్ఎస్ వైరా పట్టణ నాయకుడు మూలా దుర్గా ప్రసాద్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. వైరా బ్రాహ్మణపల్లికి చెందిన ఫణితి అబ్బాస్ కుమారుడు వేదాంత్ సిద్దిపేట మెడికల్ కాలేజీలో సీటు సాధించగా.. ఆయన విద్యార్థి చదువుల నిమిత్తం ఆదివారం ఆర్థిక సాయం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సుధాకర్, రవి, శ్రీను, శాంతయ్య, పాషా, బీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

**నర్సింహారావుకు పూర్వ విద్యార్థులు..**



ఏన్కూరు: ఆపదలో ఉన్న మిత్రుడికి పూర్వ విద్యార్థులు రూ. 1.10 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక గురుకుల విద్యాలయంలో 2001లో చదివిన రెగ్ల నర్సింహారావుకు హైదరాబాద్‌లో గుండెకు బైపాస్ సర్జరీ జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థి కోర్ కమిటీ సభ్యులు రూ.1.10 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుడిపుడి కృష్ణయ్య, గొల్లమందల బాస్కర్, గండెల సుధాకర్, మోహన్‌రావు, రాజారావు, శివశంకర్, తోట కేశవరావు, తాళ్లూరి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏన్కూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన చిలుకూరి మౌనిక, జీవన్‌కుమార్ అనే దివ్యాంగ దంపతులకు మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ అనుచరులు ఆదివారం నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఆదే విదంగా ఆ కాలనీ అనారోగ్యంతో బాదపడుతున్న జానీకి నిత్యవసరాలు అందించి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో దిశా కమిటీ సభ్యులు బాదావత్ బాలాజీ, ఎంపీటీసీ వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, ఏరువ నవీన్, పొన్నం హరికృష్ణ, కోటేశ్వరావు, ముదిగొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పొలాలు ఎండిపోతున్నాయ్..



ఎర్రబంజర్‌లో వరి పంట మేస్తున్న పశువులు

కల్లూరు: ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు లేక పోయినప్పటికీ జూలై నెలలో కురిసిన వర్షాలకు రైతులు ఎంతో ఉత్సాహంతో మండలంలో వరి సాగు చేశారు. సాగర్ ఆయకట్టు కింద, చెరువులు, కుంటల కింద సుమారు 32 వేల ఎకరాలలో వరి సాగైంది. ఈ ఏడాది 10 వేల ఎకరాలకు పైగా కరివేద పద్దతిలో వరి సాగు చేశారు. కల్లూరు మండలంలో వరికి ప్రధానంగా సాగర్ నీరే ఆధారం కాగా కృష్ణాబేసిన్‌లో వర్షాలు పడకపోవడంతో రైతులలో నిరాశ చోటు చేసుకుంది. దీంతో చుట్టపక్కల గ్రామాల్లో వరిపంట ఎండిపోతుంది. నాగార్జున సాగర్, శ్రీశైలం డ్యామ్‌లలో నీటి సామర్థ్యం తక్కువుగా ఉండడంతో.. డెడ్ స్టోరేజ్‌లో సాగునీరు విడుదల చేయడానికి లేదు. దీంతో సాగర్ ఆయకట్టు కింద పంటలు సాగు చేసిన రైతులు విల విలలాడుతున్నారు. ఎర్రబంజర్‌లో పంట పొలాలపైకి పశువులను వదులుతున్నారు.

# ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న మట్టా రాగమయి

సత్తుపల్లిరూరల్: మండలంలోని రుద్రాక్షపల్లి పంచాయతీ సత్తెంపేటలో శ్రీముత్యాలమ్మ తల్లి అమ్మవారి జీవయంత్ర ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామస్తులందరు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ మట్టా రాగమయి పాల్గొని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు రాగమయిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు భూపతిరెడ్డి, బత్తుల భరత్‌కుమార్, కందిమళ్ల ప్రసాద్, దారావత్ కృష్ణ, చీళ్ల గోపి, హరికృష్ణ, వెంకటేశ్వరరావు, రామారావు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



సత్తుపల్లిటౌన్: ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



కారేపల్లిలో..



తల్లాడ: బిల్లుపాడు గ్రామంలో ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

# ముత్యాలమ్మతల్లికి పూజలు

పిల్లాపాపలను చల్లంగా చూడమ్మ ముత్యాలమ్మతల్లి.. వర్షాలు కురవాలి.. పంటలు పండాలంటూ వాడవాడలా ముత్యాలమ్మకు ఆదివారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామునే తలంటు స్నానాలు ఆచరించి ఇళ్ల ముంగిట వేపాకు తోరణాలు కట్టి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మలకు ప్రత్యేక పూజలతో పాటుగా జలాభిషేకాలు చేశారు. కోళ్లు, మేకలు కోసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో గుడి వద్ద పండుగ వాతావరణం సంతరించుకుంది.

– సాక్షి నెట్‌వర్క్



కారేపల్లి: ముత్యాలమ్మ గుడి వద్ద బోనాలతో మహిళా భక్తులు



ఎర్రుపాలెం: తక్కెళ్లపాడులో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు



కల్లూరు: ముత్యాలమ్మ గుడి వద్ద జలాభిషేకం చేస్తున్న భక్తులు



సత్తుపల్లిరూరల్: గంగారం గ్రామంలోని గుట్టబజార్‌లో..



## అటెన్షన్ ప్లీజ్

# గుంతలతో ప్రమాదమే..



కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి సెంటర్‌లో బీటీ రోడ్డుపై గుంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు మధ్యలో ఏర్పడ్డ గుంత వల్ల ద్విచక్ర వాహనదారులు, ఆటోలకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు తక్షణం చర్యలు చేపట్టి గుంతను పూడ్చి వేయాలని ప్రజలు కోరుతున్నారు.

- కల్లూరు

ప్రశ్నించాల్సిన అధికారి : రవిచంద్ర, ఆర్‌అండ్‌బీ ఏఈ
సెల్ నంబర్ : 7013848043